ముందస్తు వసూళ్లకు స్పందన

- జిల్లాలో ఎర్లీబర్డ్ ద్వారా రూ.4.06 కోట్లు వసూలు
- ముగిసిన ఆస్తి పన్నులో ఐదు శాతం రాయితీ


రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కోల్‌సిటీ: జిల్లాలోని నగరపాలక, పురపాలకల్లో ఎర్లీ బర్డ్ ఆఫర్‌కు అనూహ్య స్పందన లభించింది. రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో గత నెల 30వరకు ఎర్లీబర్డ్ ఆఫర్ ఉండగా.. ముందస్తు ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం పన్ను రాయితీ కల్పించారు. 'ఎర్లీబర్డ్' ఆఫర్ కింద జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో ముగింపు తేదీ వరకు రూ.4.06కోట్ల ఆస్తి పన్ను వసూలైంది.

ముందస్తు చెల్లింపులపై ప్రచారం

మున్సిపాలిటీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించిన వారి కోసం ప్రభుత్వం 5శాతం రాయితీ కల్పించింది. ×ఎర్లీబర్డ్₹ ఆఫర్ స్కీంపై బల్దియా అధికారులు ప్రచారం చేశారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్, పారిశుద్ధ్య విభాగంలోని చెత్తను తరలించే ట్రాక్టర్లకు ఫ్లెక్సీలు కట్టి మైక్‌ల ద్వారా అవగాహన కల్పించారు.

నాలుగు మున్సిపాలిటీల్లో రూ.4.06కోట్లు

కార్పొరేషన్‌లో ఎర్లీబర్డ్ స్కీం ద్వారా గత ఏడాది కంటే ఇప్పుడు స్పందన లభించింది. ఇక్కడ మొత్తం రూ.కోటి 60లక్షల వరకు ముందస్తు ఆస్తి పన్ను వసూలైంది. పెద్దపల్లి మున్సిపాలిటీలో గతేడాది రూ.97.92లక్షలు వసూలుకాగా.. ఈ ఏడాది రూ.కోటి18లక్షలు వసూలైంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో రూ.31.50లక్షలు, మంథనిలో రూ.23లక్షల వరకు ముందుస్తు ఆస్తి పన్ను వసూలైంది.

పరిశ్రమల నుంచి రూ.3.47కోట్లు వసూలు

కార్పొరేషన్ పరిధిలోని పరిశ్రమల నుంచి కూడా ఎర్లీబర్డ్ ఆఫర్ కింద రూ.3కోట్ల 47లక్షల వరకు వసూలైంది. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రూ.కోటి 26లక్షలు, ఎన్టీపీసీ నుంచి రూ.2కోట్ల 21లక్షల వరకు ముందస్తు ఆస్తి పన్ను వచ్చింది. ఎర్లీబర్డ్ ఆఫర్ ద్వారా బల్దియాకు ముందస్తు ఆస్తి పన్ను చెల్లించడానికి ఆయా పరిశ్రమ అధికారులు ముందుకు రావడంపట్ల బల్దియా పాలకవర్గం, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి



నగరాభివృద్ధికి దోహదపడటానికి ప్రజలు ఆస్తి పన్ను చెల్లించడానికి ముందుకు రావాలి. సమష్టి కృషితోనే 'ఎర్లీబర్డ్' ఆఫర్ ద్వారా రూ.1.60కోట్ల వరకు ముందస్తుగా ఆస్తి పన్ను వసూలు చేయగలిగాం. ఆస్తి పన్ను వసూళ్లపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతాం.

– బి.సుమన్‌రావు, రామగుండం కమిషనర్

బల్దియా	డిమాండ్	ముందస్తు వసూలు	శాతం
రామగుండం	రూ.7.36కోట్లు	రూ.1.60కోట్లు	21శాతం
పెద్దపల్లి	రూ.3.70కోట్లు	రూ.1.18కోట్లు	33 శాతం
సుల్తానాబాద్	రూ.2.40కోట్లు	రూ.23లక్షలు	10 శాతం
మంథని	రూ.1.67కోట్లు	రూ.31లక్షలు	20 శాతం

రైతన్నకు ఎంత గోస..!


తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి ఎత్తిపోయిస్తున్న రైతు

పెద్దపల్లిరూరల్: ధాన్యం సాగు చేసిన రైతన్న అష్టకష్టాలు పడుతున్నాడు. పంట సాగు సమయంలో.. పంట చేతికందే సమయంలో వరుణదేవుడు కన్నెర్ర చేయడం అన్నదాతను ఆందోళనకు గురిచేసింది. పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన వెంగళరావు అనే రైతు తనధాన్యాన్ని అమ్మేందుకు కేంద్రంలో పోయగా వానకు తడిసిపోయింది. చేసేదిలేక మరోచోట పోసేందుకు ఇలా పొక్లెయిన్‌తో ట్రాక్టర్‌లోకి మంగళవారం ఎత్తిపోయించాడు.

నేలకొరిగిన వరి పైరు..

రామగుండం: అకాల వర్షాలతో పాటు భారీ ఈదురుగాలులతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. కాగా వాతావరణ పరిస్థితులతో కోతలు పూర్తి చేయని రైతులు సైతం నష్టపోయారు. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కోతలు పూర్తి చేయని రైతుల పొలం పూర్తిగా నేలకొరగడం, భూమి పూర్తిగా బురదమయం కావడంతో కోతలు చేపట్టడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతోనే నష్టం పెరుగుతుందన్నారు. నేల కొరిగిన వరి పైరు కోతలను చైన్ మిషన్‌తోనే పని పూర్తి చేయాల్సి ఉండగా వాటికి డిమాండ్ ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

'గడీల పాలన విముక్తికే భరోసా యాత్ర'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాసరి ఉష, నాయకులు

సుల్తానాబాద్: గడీల పాలన విముక్తి కోసమే మే 7న హైదరాబాద్ లో తెలంగాణ భరోసా యాత్రను చేపట్టామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ ఏర్పాటుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి 36 మంది ఎంపీలతో మద్దతు ఇచ్చారని తెలిపారు. సభకు కార్యకర్తలు, అభిమానులు, బహుజనులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, కల్వల శోభ, మధు పటేల్, తదితరులు పాల్గొన్నారు

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సుల్తానాబాద్: అకాల వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కోరారు. మంగళవారం సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. అధికారులు ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతుల పక్షాన బీఎస్పీ అండగా ఉంటుందని అన్నారు.

బహుమతులు అందజేత

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నిర్వహిస్తున్న బహుజన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌కు బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జీ మొలుగూరి చంద్రశేఖర్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ. రియాజ్, ఎలిగేడు మండల అధ్యక్షుడు మారం సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు పంట పరిశీలన


నువ్వుల పంటను పరిశీలిస్తున్న అధికారులు

మంథని: ముత్తారం మండలం సీతంపేటలో వేసిన నువ్వుల పంటను విజ్ఞాన కేంద్రం బృందం మంగళవారం పరిశీలించింది. పలు రకాల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసామని, నువ్వు పంట దిగుబడిపై రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. దిగుబడిపై ఆరా తీయగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. కాగా పత్తి పంట తర్వాత భూములన్నీ వృథాగా ఉండేవని ఈ సంవత్సరం కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో పత్తి పంట అయిపోయిన తర్వాత నువ్వులు వేయడంతో అధిక దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం పీసీ అండ్ హెడ్ డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్త వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో ప్రజలకు మేలు


కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

జ్యోతినగర్: కంటి వెలుగు వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్లు చేరాలు, మాధురి, నేత్ర వైద్య నిపుణురాలు ప్రవళిక, హరీశ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, ఏఎన్ఎం సుగుణ, ఆర్పీలు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మోహన్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ అనిత, డాక్టర్ ఫరహా, పీహెచ్ఎన్ సౌందర్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నిర్వహిస్తున్న కంటి వెలుగులో భాగంగా మంగళవారం 152 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, ఎంపీటీసీ ఎల్లవ్వ, ఉపసర్పంచ్ చీకటి శైలజ, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, క్యాంపు ఆఫీసర్ స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం, మంత్రుల,ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, కార్మికులు

కోల్‌సిటీ: పారిశుద్ధ్య కార్మికులకు రూ.1,000 జీతం పెంచడంతో హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తాలో బీఆర్‌టీయూ యూనియన్ ఆధ్వర్యంలో, రామగుండం మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు, నాయకులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నడిపెల్లి మురళీధర్‌రావు, గౌరవ అధ్యక్షుడు తానిపర్తి గోపాలరావు, కార్పొరేషన్ కో ఆప్షన్స్ సభ్యులు వంగ శ్రీనివాస్‌గౌడ్, సంఘం ప్రధాన కార్యదర్శి మంథని లింగయ్య రోడ్డ రాజేందర్, వేల్పుల రాజమల్లు, మంద రాములు, దుప్పటి పద్మ, కార్మికులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మరోచోటికి మార్చండి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మంథని– కాటారం రహదారిలో మాతా శిశు ఆస్పత్రి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును వేరే చోటికి తరలించాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆర్డీవో వీరబ్రహ్మాచారికి వినతిపత్రం అందించారు. పాఠశాలలకు సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. యార్డులో చెత్తను కాల్చిన సమయంలో పొగ ఏర్పడి వాహనదారులకు అసౌక్యం కలుగుతుందని, వాగు పక్కనే చెత్తను వేయడం వల్ల నీరు కలుషితమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, నాయకులు ముస్కుల సురేందర్ రెడ్డి, మంథని సత్యం, గోటికార్ కిషన్, నూకల బానయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోవధశాల తరలించాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు అంబేడ్కర్ నగర్‌లో కొనసాగుతున్న గోవధశాలను మార్చాలని బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శారదకు వినతిపత్రం అందించారు. ఇళ్ల మధ్యలో గోవులను వధిస్తూ వీటి వ్యర్థాలను అక్కడే పడవేస్తున్నారని, దీంతో దుర్వాసన వస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, ప్రధాన కార్యదర్శి సబ్బని సంతోష్,నాంపల్లి రమేశ్, బోయిని నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 14 వ వార్డులో మంగళవారం రూ.6.8 లక్షల అంచనాలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి ప్రారంభించారు. పట్టణ ప్రజలకు మెరుగైన వసతులను కల్పించేందుకు పాటుపడుతున్నానన్నారు. పట్టణం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఏఈ సతీష్ తదితరులున్నారు.

మనబడి పనులు పూర్తి చేయాలి

ఓదెల: మన–ఊరు మనబడి పనులను వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లె, బీమరిపల్లె, కొమిర గ్రామాల్లో మన–ఊరు మనబడి, అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో అసంపూర్తి పనులు, ఆయా పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదులు, కంపౌండ్ వాల్ నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జి సత్తయ్య, సర్పంచులు పులుగు తిరుపతిరెడ్డి, కల్లెపల్లి సరిత, ఎంపీటీసీ ఐరెడ్డి సరోజన ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. పల్లెప్రగతికి పాటుపడ్డ తమను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. సంఘ నాయకులు శ్రావణ్, రవీందర్‌రెడ్డి, రవికుమార్, సతీశ్, కిషోర్, రాధ, మంగ ఉన్నారు.

షరతులు లేకుండా క్రమబద్ధీకరించండి

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్ : పంచాయతీ కార్యదర్శులను షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని మండల అధ్యక్షుడు నిశాంత్ రావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, రాజీవ్ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమాపతి రెడ్డి, ప్రశాంత్, సతీశ్, సురేందర్ రావు పలువురు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని వీవోఏల నిరసన


కమాన్‌పూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

కమాన్‌పూర్: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. వీవోఏలను ఎస్ఈఆర్‌పీ ఉద్యోగులుగా గుర్తించి రూ. 26వేల కనీస వేతనం, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు రాజశ్రీ, చొప్పరి ప్రేమలత, ఉప్పరి శివలీలా, రజిత, మేఘమాల, జ్యోతి, సుమలత, శారద, దేవిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామాన్ని డీఎల్‌పీవో రాంబాబు మంగళవారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, నర్సరీని పరిశీలించారు. వేసవి నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. డీఎల్‌పీవో వెంట ఎంపీవో శేషయ్య, సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్ ఉన్నారు.

రేషన్ దుకాణాల్లో 12 రకాల సరుకులివ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెద్దపల్లిరూరల్: రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు 12 రకాల నిత్యావసర సరుకులను అందించాలని ప్రగతిశీల మహిళా సంఘ నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి ఏవో ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలను నియంత్రించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కేవలం దొడ్డు బియ్యం ఇస్తుండడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నిత్యావసర సరుకులు, సన్నబియ్యం అందించేలా చూడాలన్నారు. నాయకులు కల్పన, సత్తమ్మ, స్వరూప, పద్మ, సరోజ, సునీత, లక్ష్మి, రమేశ్, సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

రాజ్యాంగం పుస్తకాలు అందించాలి

పెద్దపల్లిరూరల్: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ప్రభుత్వం ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ గణేశ్, కో కన్వీనర్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో ప్రసాద్ కు వినతిపత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ ఇంటికి భారత రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

రామగుండం: అంతర్గాం మండలంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న స్థలాలు సరిగా లేవని, నల్ల రేగడి భూములు కావడంతో చినుకుపడితే చిత్తడిగా మారి బురదమయం అవుతున్నాయని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల్లో అత్యధిక శాతం కౌలు రైతులేనన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఎమ్మెల్యే చందర్, ఎంపీ వెంకటేశ్ నేత పరామర్శించి భరోసా కల్పించాలని కోరారు. మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం


కొనుగోళ్లను పరిశీలిస్తున్న బలరాంరెడ్డి

ధర్మారం: తడిసిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాం రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని రచ్చపల్లి, దొంగతుర్తి, ఖిలావనపర్తిలో కొనుగోలు కేంద్రాలను మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డితో కలిసి సందర్శించి మాట్లాడారు. ప్రతి పక్షాల మాటలతో రైతులు ఆందోళన చెందొద్దని ధాన్యాన్ని నిబంధనలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సదన్‌బాబు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దుర్గామాతకు లక్ష పుష్పార్చన


పారాయణం చేస్తున్న భక్తులు

జ్యోతినగర్: దుర్గామాతకు లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం భరత్ నగర్‌లోని దుర్గామాత ఆలయంలో భక్తులు 41 రోజుల పూజా కార్యక్రమంలో లక్ష మల్లె పూలతో అర్చన చేసి, లక్ష నామాలను పఠించారు. అర్చకులు రాజగోపాలచారి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా హోమం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుక్కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో హోమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం, సాయంత్రం ఆరగింపు, బలిహారణం వంటి పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

సుల్తానాబాద్‌రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం మహిపాల్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో పంట నష్టం సర్వే చేయించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని, ఈ నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల లింగారెడ్డి, కేశవరావు, రాజిరెడ్డి, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌కు చెందిన గోనె రాజిరెడ్డి (38) అతిగా మద్యం తాగి రాత్రి పూట రోడ్డుపై పడి మృతిచెందాడు. ఎస్సై వెంకటకృష్ణ, మృతుడి తల్లి సుశీలమ్మ కథనం మేరకు.. రాజిరెడ్డి సోమవారం అతిగా మద్యం తాగి రాత్రి ఇంటికొచ్చే క్రమంలో ఎస్సీకాలనీ వద్ద రోడ్డు పక్కన పడిపోయాడు. ఉదయం గ్రామస్తులు చూసి కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. రాజిరెడ్డికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురోహితుడు శివకుమార్‌కు అవార్డు ప్రదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి చెందిన పురోహితుడు శివకుమార్‌కు జాతీయస్థాయి మహానంది అవార్డును మంగళవారం ప్రదానం చేశారు. ఆదర్శ కళానిలయం సంస్థ వారు ఆధ్యాత్మిక రంగంలో అందించిన సేవలను గుర్తించి హైదరాబాద్ త్యాగరాజ గానసభలో బుల్లితెర నటులు దేవజ్ఞశర్మ, పూర్ణిమ, జ్యోతిరెడ్డి, సత్య చేతులమీదుగా శివకుమార్ కు అవార్డును అందించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య శ్రమశక్తి అవార్డును అందుకోగా, మంగళవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో పాటు టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు దగ్గుల కిరణ్మయికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిన సందర్భంగా అధ్యాపకులు సోమవారం డిగ్రీ కళాశాలలో ఆమెను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజాజీరమద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు ప్రారంభం

జ్యోతినగర్: మేడే వారోత్సవాలను నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎస్.భిక్షపతి మంగళవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో ప్రారంభించి మాట్లాడారు. ఈనెల ఆరో తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో భాగ్య, దేవేంద్ర, సంపత్, గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సతీశ్ కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గం విద్యార్థి, యువజన విభాగం అధ్యక్షుడిగా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన గడ్డం సతీశ్ కుమార్ గౌడ్ ను నియమిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు రఘువీర్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ వర్గాల ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి, బీసీల అభ్యునతికి కృషి చేస్తానని తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల అధ్యక్షుల ఎన్నిక

పెద్దపల్లిరూరల్: ఆర్యవైశ్య సంఘం పెద్దపల్లి పట్టణ, మండల అధ్యక్షులను మంగళవారం జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మంచాల వరప్రసాద్, మండల అధ్యక్షుడిగా యాంసాని వేణుగోపాల్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కొమురవెల్లి రాజేందర్ ప్రకటించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ, కార్యదర్శి లింగమూర్తి, సదానందం, యూత్ అధ్యక్షుడు పెద్ది వెంకటేశ్ ఉన్నారు.